నీళ్లిచ్చినందుకా కేసీఆర్‌కు నోటీసులు

- మాజీ రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ వంగ నాగిరెడ్డి

సిద్దిపేట అర్బన్, మే 21: తెలంగాణ ప్రజల సాగు, తాగు నీటి గోస తీర్చి బీడుబారిన పొలాలను పచ్చని మాగాణంగా మార్చినందుకేనా తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు నోటీసులు ఇచ్చారని రైతుబంధు సమితి జిల్లా మాజీ కన్వీనర్ వంగ నాగిరెడ్డి బుధవారం ప్రకటనలో మండిపడ్డారు. సమైక్య రాష్ట్రంలో గోసపడ్డ తెలంగాణ, కాళేశ్వరం ప్రాజెక్టు వల్లనే పచ్చగా మారిందన్నారు. ముమ్మాటికీ కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణ వరప్రదాయిని అన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు ఇచ్చి, రైతుబంధు, రైతుబీమా ఇచ్చి, 24 గంటలు కరెంట్, సకాలంలో ఎరువులు, విత్తనాలు, ఊరూరా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయలేక, పాలన చేతకాక, ప్రభుత్వ వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకు నోటీసుల పేరు మీద డ్రామాలు ఆడుతున్నదని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్, హరీశ్‌రావు వైపే రైతాంగం ఉంటుందన్నారు. రాజకీయ దురుద్దేశంతో నోటీసులు పంపడంపై రాష్ట్ర రైతులంతా తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇష్టారీతిగా వ్యవహరిస్తే రైతులమంతా తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు.

కేసీఆర్‌పై ప్రభుత్వం కక్షసాధింపు

గజ్వేల్, మే 21: కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని బీఆర్ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొట్టాల యాదగిరి అన్నారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో బీడు భూములు సస్యశ్యామలం అయినట్లు తెలిపారు. ధాన్యం దిగుబడిలో దేశంలోనే అగ్రగామిగా తెలంగాణను నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గడిచిన తొమ్మిదిన్నరేండ్ల కాలంలో రైతు ఆత్మహత్యలను నివారించి రైతులు ఆర్థికంగా బలోపేతం చేశారని, అది జీర్ణించుకోలేక రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసీఆర్ కుటుంబంపై కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని, అకాల వర్షాలతో ధాన్యం తడుస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బయపడేది లేదన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

బాధిత కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఏర్పుల మహేశ్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

గజ్వేల్, మే 21: మండలంలోని బయ్యారం గ్రామానికి చెందిన కొలనుపాక అరవింద్ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందాడు. ఆర్థికసాయం కోసం సీఎంఆర్ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఆయనకు రూ.18,500 విలువైన చెక్కును బుధవారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కుమార్, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

కొమురవెల్లి, మే 21: సీఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు వరమని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏర్పుల మహేశ్ అన్నారు. కొమురవెల్లికి చెందిన చిక్కుడు సత్తయ్యకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండ శ్రీధర్, పాశం స్వామి, చిక్కుడు స్వామి పాల్గొన్నారు.

కొన్న ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి

జాలిగామలో హమాలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

గజ్వేల్, మే 21: కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా మిల్లులకు తరలించాలని, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా కవర్లు కప్పి ఉంచాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. బుధవారం మండలంలోని జాలిగామ, గజ్వేల్ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాలిగామ కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యాన్ని లారీలు తెప్పించి మిల్లులకు తరలించాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం జాలిగామ రైతు సుధాకర్‌ను శాలువాతో అదనపు కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం ప్రవీణ్, తహసీల్దార్ శ్రవణ్, ఏఎంసీ కార్యదర్శి జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి

కార్యక్రమంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

కొమురవెల్లి, మే 21: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఉపాధ్యాయులకు డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చాడు. బుధవారం కొమురవెల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో సందర్శించాడు. ఈ సందర్భంగా శిక్షణ గురించి కొమురవెల్లి ఎంఈవో రమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కేవలం ఉపాధ్యాయులు పని తీరు మీద మాత్రమే ఆధారపడి ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై సమాజం వైఖరి మార్చడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు టీచర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ఎల్ఎఫ్ఎల్, ఎస్‌జీటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోహెడలో డ్రగ్స్ నిర్మూలన యాత్ర

కోహెడ, మే 21: కోహెడలోని ఐకేపీ భవనం నుంచి మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు బుధవారం డ్రగ్స్ నిర్మూలనపై పోరు యాత్ర నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని నిర్మల, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, మంద ధర్మయ్య, బోయిని లక్ష్మణ్, గవ్వ వంశీధర్‌రెడ్డి, వలుస సుభాష్, జయ, కవ్వ లక్ష్మారెడ్డి, మేకల వీరన్న యాదవ్, ద్యాగల సారయ్య, తిరుపతి, గాండ్ల పద్మ, కోడూరి శ్రీదేవి, తాళ్లపెల్లి జగన్ తదితరులు పాల్గొన్నారు.

కష్టాలను తొలిగించే దైవం హనుమంతుడు

శోభాయాత్ర నిర్వహిస్తున్న హనుమాన్ మాలధారులు

చిన్నకోడూరు, మే 21: ఆంజనేయస్వామిని హిందూ ధర్మంలో రక్షకుడు, విజయ ప్రదాత, అడ్డంకులను తొలగించే దేవుడిగా భావిస్తారు అని గురుస్వామి జంగిటి శ్రీనివాస్ అన్నారు. హనుమాన్ దీక్ష పురస్కరించుకుని మంగళవారం రాత్రి హనుమాన్ మలాధారణ స్వాములు మండల కేంద్రంలో ఆంజనేయస్వామి శోభాయాత్ర నిర్వహించారు. జంగిటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంజనేయుడు తనని నమ్మిన వారికీ సమస్త విజయాలను ప్రసాదిస్తాడని ప్రజలు నమ్ముతారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాముని ఉమేశ్ చంద్ర, మాజీ ఎంపీటీసీ పొనుగంటి శారద రమేశ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చెరుకు పెద్దులు ఉన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

గజ్వేల్: ముట్రాజ్‌పల్లి రింగ్‌రోడ్డుపై వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

రాయపోల్: ఐకేపీ కేంద్రంలో..

గజ్వేల్, మే 21: గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ముట్రాజ్‌పల్లి రింగ్‌రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం బుధవారం అకాల వర్షానికి కొట్టుకుపోయింది. వర్షానికి రోడ్డు పక్కకు కొట్టుకుపోయిన ధాన్యాన్ని రైతులు ఒక్కదగ్గరకు చేర్చే ప్రయత్నం చేయగా, ప్రయోజనం లేకుండా పోయింది. భారీ వర్షానికి ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం తడవడంతో పాటు కొట్టుకు పోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. రోడ్లపై వర్షం నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

రాయపోల్‌లో తడిసిన ధాన్యం

రాయపోల్, మే 21: మండలంలో బుధవారం తెల్లవారుజామున అకాల వర్షం కురిసింది. వర్షానికి రాయపోల్‌లోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసి ముద్దయ్యింది. రైతులు నాలుగు రోజులుగా ఆరబెట్టిన ధాన్యం వర్షంతో తడిసింది. ఐకేపీ ఏపీఎం కిషన్, ఆర్ఐ రాజమౌళి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. వెంటవెంటనే తూకం వేసి లారీల ద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సెంటర్ నిర్వాహకులకు ఆదేశించారు. అకాల వర్షాలు ఉన్నందున మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కోహెడలో భారీ వర్షం

కోహెడ, మే 21: కోహెడ మండలంలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులు వీచాయి. అకాల వర్షానికి కొన్ని చెట్లు విరిగిపడ్డాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

చేర్యాలలో భారీ వర్షం

చేర్యాల, మే 21: చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో బుధవారం రెండుసార్లు భారీ వర్షం కురిసింది. బలమైన గాలులు వీయగా, ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

సిద్దిపేటలోనూ...

సిద్దిపేట, మే 21: అల్పపీడన ప్రభావంతో సిద్దిపేట జిల్లా కేంద్రంలో పాటు పలు మండలాల్లో బుధవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమైన వర్షం అప్పటి నుండి చిరుజల్లులతో ఎడతెరిపి లేకుండా కురిసింది. అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. వర్షం కురుస్తుండడంతో ముందస్తుగా విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వాతావరణం చల్లబడడంతో ఉక్కపోత నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

తడిసిన ధాన్యం... కూలిన ఇండ్లు

వర్గల్, మే 21:మండల వ్యాప్తంగా బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నాచారంకు చెందిన సంగెం యాదగిరి, సంగెం శ్రీనివాస్ పెంకుటిండ్లు కూలిపోయాయి. అంబార్‌పేట, శాకారం, వర్గల్, నెంటూర్, వేలూర్ గ్రామాల్లో ఐకేపీ సెంటర్లల్లో ఆరబోసిన వడ్లు వర్షానికి తడిసిపోయాయి.

వర్గల్: నెంటూర్‌లో భారీ వర్షానికి తడిసిన వడ్లు

గజ్వేల్: పట్టణంలో జలమయమైన రోడ్డు

రాయపోల్‌లో తడిసిన వడ్లను చూపుతున్న రైతు

షీటీమ్స్‌తో మహిళలకు భరోసా కల్పిస్తున్నాం

- సిద్దిపేట సీపీ అనురాధ

మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, మే 21: పిల్లలు, మహిళల రక్షణకు తామున్నామని పూర్తి నమ్మకం, భరోసా పోలీసులు కల్పించాలని సిద్దిపేట సీపీ అనురాధ సూచించారు. షీటీమ్, భరోసా, స్నేహిత సిబ్బంది మహిళలు, పిల్లల రక్షణ గురించి తీసుకుంటున్న చర్యలపై బుధవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో సీపీ అనురాధ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. హాట్ స్పాట్స్‌పై నిఘా మరింత పెంచాలని, రోజుకు మూడు, నాలుగుసార్లు హాట్ స్పాట్స్ సందర్శించాలన్నారు. మహిళలను, పిల్లలను వేధింపులకు గురిచేస్తే మౌనం వీడి బాధితులు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేసేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్కూల్స్, కాలేజీల్లో షీ టీమ్ ప్రోగ్రామ్ అయిపోయిన తర్వాత సం బంధిత టీచర్లు, పిల్లలతో సరాదాగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవాలన్నారు. స్కూల్‌కు వచ్చే అమ్మాయిలలో ప్రవర్తనలో మార్పు వస్తే వెంటనే స్కూల్ టీచర్లు షీటీమ్ సిబ్బందికి తెలియపరిచాలన్నారు. పిల్లలు సోషల్ మీడియా వ్యసనం బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సీపీ సూచించారు.

బీఆర్ఎస్ నేత ఔదార్యం

వైశాలికి పుస్తెమట్టెలను అందజేస్తున్న మ్యాకల కనకయ్య

మర్కూక్, మే 21: మర్కూక్ మండలం బీసీ సెల్ అధ్యక్షుడు, సేవారత్న అవార్డు గ్రహీత మ్యాకల కనకయ్య పాములపర్తికి చెందిన పేదింటి వధువు రజిత-రమేశ్ దంపతుల కూతురు వైశాలి పెండ్లికి పుస్తెమట్టెలను అందజేశారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వస్తే కళ్యాణలక్ష్మీ పథకంతో తులంబంగారం ఇస్తామన్న హామీ విస్మరించిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో పిట్ల మహేశ్, చిన్నబోయిని మురళీకృష్ణ, చెక్కల నర్సింలు, ఉప్పరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

త్వరగా పనులు పూర్తిచేయాలి

రాజిరెడ్డిపల్లిలో ట్యాంకుల నిర్మాణాలను పరిశీలిస్తున్న గరిమా అగర్వాల్

గజ్వేల్, మే 21: డంపింగ్ యార్డులోని బయోమైనింగ్ చేయబడిన జీరో వేస్ట్, డీఆర్‌సీసీలోని డ్రైవేస్ట్ ద్వారా రీసైక్లింగ్‌కు పంపు పొడి వనరులను అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ బుధవారం పరిశీలించి మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ద్వారా వివరాలు తెలుసుకున్నారు. తడి చెత్తతో వర్మీ కంపోస్టు ఎరువు తయారీ విధానంతో పాటు నిల్వ ఉన్న కంపోస్టు ఎరువులను పరిశీలించారు. గజ్వేల్ పట్టణంలో పర్యటించిన సందర్భంగా మున్సిపల్ పరిధిలోని రాజిరెడ్డిపల్లిలో నిర్మాణంలో ఉన్న అమృత్ 2.0లోని వాటర్ ట్యాంకర్లను, వాటర్ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్రీడల్లో జిల్లాను ముందంజలో నిలపాలి

వెంకటనర్సయ్యను అభినందిస్తున్న మంత్రి

హుస్నాబాద్‌టౌన్, మే 21: క్రీడల్లో సిద్దిపేట జిల్లాను ముందంజలో నిలపాలని బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. జిల్లా క్రీడలు,యువజన అధికారిగా బాధ్యతలు చేపట్టిన జంగపల్లి వెంకటనర్సయ్య బుధవారం మంత్రిని మర్యాద పూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో క్రీడల అభివృద్ధికి స్పోర్ట్స్ అథారిటీ నుంచి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. క్రీడాకారుల కోసం మంచి కార్యక్రమాలు నిర్వహించాలని వెంకటనర్సయ్యకు మంత్రి సూచించారు.

దివ్యాంగులపై ప్రభుత్వం వివక్ష తగదు

మాట్లాడుతున్న దివ్యాంగుల సంఘం నాయకులు, సభ్యులు

హుస్నాబాద్ టౌన్, మే 21: దివ్యాంగులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధమని తెలంగాణ దివ్యాంగుల జేఏసీ కమిటీ హుస్నాబాద్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు దండు శంకర్, అధ్యక్షుడు చిట్టెల సంపత్ అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో నిర్వహించిన దివ్యాంగుల నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ.. దివ్యాంగులను ప్రభుత్వం చిన్నచూపుచూస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంక్షేమ పథకంలో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. రూ.6వేల పింఛన్, కొత్తవారికి ధ్రువపత్రాలను అందజేయడం లేదని, ఆర్టీసీలో దివ్యాంగులకు పూర్తిగా ఉచిత ప్రయాణం కల్పించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రీశైలం, దుర్గయ్య, సరిత, అంజయ్య, నాగరాజు, శ్రీకాంత్, నారాయణ, కనకరాజు, మల్లేశం పాల్గొన్నారు.

టీజీడీజేఏసీ అధ్యక్షుడిగా వెంకటేశ్...

హుస్నాబాద్ నియోజకవర్గ తెలంగాణ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ(టీజీడీజేఏసీ) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేడబోయిన వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా కనకయ్య, ప్రధాన కార్యదర్శిగా నీవన్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా లింగం, కోశాధికారిగా వేణుగోపాల్, సభ్యులుగా రాజయ్య, రాజును ఎన్నుకున్నారు.

పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

మద్దూరు(ధూళిమిట్ట), మే 21: గ్రామాల్లో పచ్చదనాన్ని కాపాడాలని, పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని అధికారులకు జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి సూచించారు. బుధవారం మద్దూరులో ఈ-పంచాయతీ అప్లికేషన్లపై పంచాయతీ కార్యదర్శులతో డీపీవో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో గ్రామాల్లోని వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డులు, హరిత నర్సరీల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు వచ్చేవని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవని, మల్టీ పర్పస్ సిబ్బందితోనే వాటి నిర్వహణను చేయించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఈ పంచాయతీ అప్లికేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో మద్దూరు, ధూళిమిట్ట మండలాల ఎంపీడీవోలు రామ్మోహన్, వీరరాజు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యజీవితంలో వ్యాయామం తప్పనిసరి

హాఫ్ మారథాన్ మూడవ ఎడిషన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట, మే 21: ఆరోగ్యానికి ప్రతిఒక్కరూ నిత్యజీవితంలో వ్యాయామం తప్పనిసరిగా చేసుకోవాలని కలెక్టర్ మను చౌదరి అన్నారు. సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై 27న సిద్దిపేట రంగనాయక సాగర్ ప్రాజెక్టుపై జరిగే హాఫ్ మారథాన్ వాల్ పోస్టర్‌ను బుధవారం పోలీస్ కమిషనర్ అనురాధ, కలెక్టర్ మనుచౌదరి ఆవిష్కరించారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. జిల్లాలో ఉత్సాహవంతులైన యువతీ, యువకులు ఈ మారథాన్‌లో పాల్గొనాలని కోరారు. ఇప్పటికే హాఫ్ మారథాన్ డిజిటల్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజు, సభ్యులు హరికృష్ణ, నారాయణరెడ్డి, రాజిరెడ్డి, రమేశ్, లింగారెడ్డి, శ్రవణ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, కృష్ణారెడ్డి శ్రీనివాస్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షయరహిత గ్రామాలే లక్ష్యం

మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రామ్ అధికారి శ్రీనివాస్

సిద్దిపేట, మే 21: టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని టీబీ అలర్ట్ ఇండియా ప్రోగ్రామ్ జిల్లా ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం సిద్దిపేట రూరల్ మండలం మండలం నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని నారాయణరావుపేట, రాఘవపూర్, లక్ష్మీదేవిపల్లి, రావురూకుల, చింతమడక గ్రామాల్లోని టీబీ చాంపియన్స్‌తో కలిసి మాట్లాడారు. క్షయ నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రాథమిక దశలో గుర్తిస్తే సులభంగా జబ్బును నయం చేయవచ్చన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే ప్రతి ఒక్కరూ తెమడ పరీక్ష చేయించుకొని వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డాక్టర్ బాపురెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రియదర్శిని, అజయ్, వైద్య సిబ్బంది పద్మావతి, భూంపల్లి రాజు, సుధ, చంద్రకళ, కరుణావతి, సుజాత, జ్యోతి. పద్మ, భారతి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణపై ప్రభుత్వం స్పందించాలి

మాట్లాడుతున్న ఆముదాల మల్లారెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), మే 21: అధికారుల నిర్లక్ష్యంతోనే ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. బుధవారం మద్దూరులో సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం సెంటర్ల వద్ద వర్షాలకు తడిసి ముద్దవుతున్నదన్నారు. దీనికి ప్రధాన కారణం ఐకేపీ, సొసైటీల నిర్లక్ష్యమే కారణమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన సీపీఎం ఉద్యమిస్తుందని తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆలేటి యాదగిరి, మండల కార్యదర్శి ఎండీ షఫీ, సభ్యులు ఎల్లస్వామి, రమేశ్, కనకయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విస్తరణ పనులతో నిత్యం ప్రమాదాలు

అనభేరి విగ్రహం వద్ద డ్రైనేజీ పక్కన దిగబడిన లారీ

హుస్నాబాద్ టౌన్, మే 21: జాతీయ రహదారి పనులు అస్తవ్యస్తంగా సాగుతుండడంతో హుస్నాబాద్ పట్టణంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. హుస్నాబాద్ బస్టాండ్ ఎదురుగా డివైడర్‌ను ఢీకొని దుకాణాల ముందు లారీ బోల్తాపడిన ఘటన మరవక ముందే అనేభేరీ విగ్రహం వద్ద మరోలారీ బుధవారం ప్రమాదానికి గురైంది. వరంగల్ నుంచి కరీంనగర్‌కు చేపల లోడ్‌తో వెళ్తున్న లారీ అనభేరి విగ్రహం వద్ద మురుగు కాల్వ పక్కన భూమిలో కూరుకుపోయింది. డ్రైనేజీ కాల్వ పనులు సరిగా చేయకపోవడంతో లారీ డ్రైవర్ దాన్ని గుర్తించకపోవడంతో లారీ దిగబడిపోయింది. అసంపూర్తి పనుల వల్లే ఇది జరిగిందని స్థానికులు ఆరోపించారు. రహదారి పనులను పూర్తిస్థాయిలో చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పట్టణ వాసులు పేర్కొన్నారు.

డ్రగ్స్‌రహితంగా తీర్చిదిద్దుదాం

అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు

కొమురవెల్లి, మే 21: కొమురవెల్లి మండలాన్ని డ్రగ్స్‌రహితంగా తీర్చిదిద్దుదామని ఎస్సై లింగంపల్లి రాజు అన్నారు. బుధవారం కొమురవెల్లిలోని ఆటోస్టాండ్ వద్ద పోలీస్ సిబ్బందితో కలిసి డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అమ్మినా, కొన్నా, తాగినా పోలీసులకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రమాదకర బావి పూడ్చివేత

ప్రమాదకరంగా మారిన బావిని పూడ్చి వేయిస్తున్న ఎస్సై మహబూబ్

మద్దూరు(ధూళిమిట్ట), మే 21: మద్దూరు మండలంలోని రేబర్తి-వల్లంపట్ల గ్రామాల మధ్యలో ప్రమాదకరంగా మారిన వ్యవసాయ బావిని మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు పూడ్చివేశారు. రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావి వద్ద గతంలో అనేక ప్రమాదాలు జరిగాయని, ప్రమాదాల నివారణలో భాగంగా వాహన చోదకుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు రోడ్డు పక్కనే ఉన్న కలకోటి నర్సింహారెడ్డి అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిని మట్టితో పూడ్చివేసినట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై మహబూబ్‌ను పలువురు అభినందించారు.

కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

హుస్నాబాద్ టౌన్, మే 21: బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అందులో భాగంగా ప్రజలను డైవర్షన్ చేయడానికి కాళేశ్వరంలో అవినీతి జరిగిందంటూ ప్రభుత్వం గగ్గోలు పెడుతున్నదని విమర్శించారు. ప్రజల కష్టాలను తీర్చకుండా బీఆర్ఎస్‌ను విమర్శిస్తూ, కేసులు పెడుతూ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం బీఆర్ఎస్‌పై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

కోహెడ, మే 21: కోహెడ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో వివిధ అంశాల పట్ల రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇచ్చారు. 91 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. ఎంఈవో పద్మయ్య శిక్షణ కార్యక్రమంలో టీచర్లకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. దామోదర్, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, సురేందర్, శంకర్, గణేష్, హరిప్రసాద్, బలేశం పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుచేయాలి

సిద్దిపేట అర్బన్, మే 21: మండలంలోని బక్రిచెప్యాలలో రైతులకు వానకాలం సాగు యాజమాన్య పద్ధతులపై బుధవారం మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్ అవగాహన కల్పించారు. వానకాలం సాగు- సంసిద్ధత, పచ్చిరొట్ట ఎరువులు, విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు, ఆయిల్‌పామ్ సాగు ఆవశ్యకత, ఫార్మర్ రిజిస్ట్రీ మొదలగు అంశాలపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనాథ్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని, ప్రభుత్వం రాయితీలను ఇస్తున్నట్లు తెలిపారు. విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, అధీకృత డీలర్ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ఏఈవో రాజేశ్, రైతులు పాల్గొన్నారు.

భూసారాన్ని సంరక్షించుకోవాలి

రాయపోల్, మే 21: తక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడి భూసారాన్ని సంరక్షించుకోవాలని తొర్నాల వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు శ్రీదేవి, సరిత అన్నారు. బుధవారం దౌల్తాబాద్ రైతుల వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. పంట మార్పిడి, నీటి సంరక్షణ పద్ధతులు, విత్తన రకాలు, మొక్కలు నాటడం, పచ్చిరొట్ట ఎరువులు వాడకం పంట వ్యర్థా లను కాల్చివేయడం వల్ల వచ్చే నష్టాల గురిం చి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని, తక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. భూసార పరీక్ష అధారంగా ఎరువులు వినియోగిస్తే నేలను కాపాడుకోవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి పరుశురాం, ఇంచార్జి వ్యవసాయాధికారి సత్యఅన్వేష్, ఏఈవోలు సంతోష్‌కుమార్, రజినీకాంత్, సునంద, శిరీష, రైతులు పాల్గొన్నారు.